# సైబర్ నేరాలపై ప్రజలు
# అప్రమత్తంగా ఉండాలి

- స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో వచ్చే లింక్‌లు క్లిక్ చెయ్యవద్దు
- జిల్లా ఎస్పీ తుషార్ డూడి



**బాపట్ల నవభూమి–:** స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో వచ్చే తెలియని లింక్‌లు క్లిక్ చెయ్యవద్దని జిల్లా ఎస్పీ తుషార్ డూడి జిల్లా ప్రజలకు సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.ఆఫర్లు,లాభాల పేరుతో నమ్మించి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారన్నారు.నకిలీ వెబ్‌సైట్లతో లాభాల ఆశచూపి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారన్నారు.ఇటీవల కాలంలో ఆన్‌లైన్ స్టాక్ పెట్టుబడుల మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.జిల్లా పరిధిలోని ఒక వ్యక్తికి వాట్సాప్‌లో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ఓ లింక్ వచ్చిందని ఆన్లైన్ ట్రేడిరగ్,ఐపీఓలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించారన్నారు.దీంతో బాధితుడు తన ఆధార్,పాన్ కార్డ్ వివరాలతో ట్రేడిరగ్ అకౌంట్ తెరువగా మొదటగా సైబర్ కేటుగాళ్లు చెప్పిన విధంగా కొంత మొత్తం డిపాజిట్ చేశాడన్నారు.నకిలీ ట్రేడిరగ్ ఖాతాలో లాభాలు వచ్చినట్లు చూపించి అది నమ్మిన బాధితుడు బల్క్ ట్రేడిరగ్లో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాడన్నారు.ఒక వారం రోజులు స్టాక్స్ కలిగి ఉంటే,మంచి లాభాలు వస్తాయని మరోసారి నమ్మించారన్నారు. అనంతరం బాధితుడు లాభాలు కలిపి మొత్తం సుమారు రూ.40,00,000 లక్షలు చూపించారన్నారు.ఆ డబ్బును విత్ డ్రా చేసుకునే ప్రయత్నం చేయడంతో సాధ్యం కాలేదని విత్ డ్రా చేసుకోవాలంటే మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని,కమీషన్ ఇతర చార్జీల పేరుతో మరింత డబ్బు ట్రాన్స్ఫర్ చేయాలని ఒత్తిడి చేశారు.దీంతో మోసపోయానని గ్రహించి స్టేషన్లో పిర్యాదు చేశాడని వివరించారు.వాట్సాప్,టెలిగ్రాంలలో వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు.మోసపూరిత మాటలు విని ఇన్వెస్టిమెంట్స్ చేయడం వల్ల,అత్యాశతో చాలా మంది వారి విలువైన డబ్బును పోగొట్టుకుంటున్నారు.మీ అత్యాశ మోసగాళ్ళకు అవకాశంగా మారుతుందని తెలిపారు.సైబర్ కేటుగాళ్ళతో తస్మాత్ జాగ్రత్తగా ఉండాలన్నారు.డబ్బులు ఎవరికి ఊరికేరావు మీ కష్టార్జితం సైబర్ నేరస్థులకు పోనివ్వొద్దని సూచించారు.ఏద్కెనా సైబర్ నేరం జరిగిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేయడం ద్వారా కాని (లేదా) అనే వెబ్సైట్ ద్వారా పిర్యాదు చేస్తే మీరు పోగొట్టుకున్న డబ్బులను చాలా వరకు తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు.


### కోడి పందెం శిబిరంపై దాడి..18,070 రూ
# నగదు స్వాధీనం

## సీఐ మల్లికార్జున రావు

**పమిడిపాడు, డిసెంబర్ 1 (నవభూమి)** కొరిసపాడు మండలం పమిడిపాడు గ్రామ శివారు నందు కోడిపందాలు జరుగుతున్నాయని సమాచారంతో సీఐ మల్లికార్జునరావు నేతృత్వంతో ఎస్సైలు సురేష్, మహమ్మద్ రఫీలు తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. 14 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 18,070 రూపాయలు నగదును, 2 కోళ్లు, 8 కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించినట్లు సిఐ మల్లికార్జునరావు తెలియచేశారు. అద్దంకి రూరల్ పరిధిలో అక్రమ మద్యం అమ్మకాలు, పేకాట, కోడి పందాలు వంటి వాటిపై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు ఆయన చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి వివరాలు తెలిపితే వారి విషయాలు గోప్యంగా ఉంచబడతాయని సిఐ మల్లికార్జునరావు తెలియచేశారు.




# నవభూమి
## జిల్లా అనుబంధం



02 డిసెంబర్,2024 సోమవారం | పేజీలు:9

www.epaper.navabhoomi.in


# మాట నిలబెట్టుకోండి:బాబూ

- విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై పెనుభారం
- ఐదున్నర నెలల్లోనే రూ.15485 కోట్ల వడ్డింపా
- ఎన్నికలకు ముందు చెప్పిన మాటలు గుర్తున్నాయా?
- చార్జీలు పెంచను..తగ్గిస్తానని చెప్పి ఇప్పుడీ బాదుడేంటి?



**అనంతపురం, డిసెంబర్ 1 : నవభూమి** అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం..విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం అని చెప్పిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కోరారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ప్రచారంలో వైఎస్ జగన్ కరెంట్ చార్జీలు పెంచారు.. నేను తగ్గిస్తానని చెప్పిన చంద్రబాబు, ఐదున్నర నెలల్లో ప్రజలపై ఏకంగా రూ.15485 కోట్ల భారం వేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో చంద్రబాబు మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు. ప్రజలు నమ్మి ఓటు వేస్తే వాళ్ల నడ్డి విరిచేలా కరెంట్ చార్జీలు పెంచడం తగదన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు పెరిగాయని, విద్యుత్ చార్జీల పెంపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెనుభారంగా మారుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీపావళి పండుగ సమయంలో రూ.6072 కోట్ల భారం వేశారని, ఇప్పుడు మరో రూ.9412 కోట్ల భారం వేస్తున్నారని విమర్శించారు. తక్షణం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. “కేంద్రంలో కూడా మీరు భాగస్వామి. మీపై ఆధారపడే మోదీ ప్రభుత్వం నడుస్తోంది. నిధులు తీసుకుని వచ్చి ప్రజలపై భారం పడకుండా చూడండి. ఇదేదో వైసీపీ వాళ్లు మాత్రమే అడుగుతున్నది కాదు.. తెలుగుదేశం పార్టీకి ఓటు వేసిన వాళ్లు కూడా కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు నెలకు రూ.1000 విద్యుత్ బిల్లు వచ్చే ఇంటికి.. ఇకపై సుమారు రూ.1500 నుంచి రూ.1600 వరకు బిల్లు వస్తుంది. స్లాబ్‌ను బట్టి యూనిట్‌కు 2 రూపాయలపైన భారం పడుతుంది. ఇది సామాన్యుల నడ్డివిరచడమే. ఇప్పటికే వామపక్షాలు ఉద్యమిస్తున్నారు. మేం కూడా ప్రజల తరఫున పోరాటం చేస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకోవాలి” అని తెలిపారు.మీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.. కానీ.రాయదుర్గం నియోజకవర్గంలోని నేమకల్లుకు వచ్చిన సీఎం చంద్రబాబు.. 5 టీఎంసీలతో ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణంతో పాటు హెచ్ఎల్సీ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పడాన్ని జిల్లా వాసిగా స్వాగతిస్తున్నానని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. అయితే ఇది మాటలకే పరిమితం చేయొద్దని అన్నారు. గతంలో రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా హంద్రీనీవాను పూర్తి చేయలేదని, వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాకే పనులు వేగవంతం అయ్యాయని గుర్తు చేశారు. దాని ఫలితంగానే 2012 నుంచి కృష్ణా జలాలు జిల్లాకు వస్తున్నాయని చెప్పారు. 5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం అనేది ఇప్పుడున్న టెక్నాలజీతో త్వరితగతిన పూర్తి చేయవచ్చని తెలిపారు. రెండు, రెండున్నరేళ్లలో ఉంతకల్లు రిజర్వాయర్ పూర్తి చేసి చంద్రబాబే ప్రారంభించాలని కోరారు. చంద్రబాబు తీరు ఏరు దాటే వరకు ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న అనే రకంగా ఉంటుందని గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చెప్పేవారని.. ఆ అపవాదును తొలగించుకోవాలని సూచించారు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి కేవలం పింఛన్లు పంపిణీకే పరిమతం అయ్యారని, ఉచిత సిలిండర్ కూడా పూర్తి స్థాయిలో అందడం లేదని తెలిపారు.

# కొండలరావుపాలెంలో అభయాంజనేయ స్వామికి టిడిపి నేతలు పూజలు



**దెందులూరు డిసెంబర్ 1 నవభూమి** అతివృష్టి .అనావృష్టి బారిన పడకుండా ప్రకృతి విపత్తులు రాకుండా గ్రామంలో ప్రజలందరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుఖ సంతోషాలతో పాడిపంటలతో ఉండేలా చూడాలని కొండలరావుపాలెం గ్రామంలోని అభయ ఆంజనేయ స్వామిని కొండలరావు పాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు. అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు పాలడుగు నరసింహారావు. టిడిపి నేత పాలడుగు సాంబశివరావు అన్నారు. ఆదివారం దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి మండలం కొండలరావుపాలెం గ్రామంలోని నాలుగు రోడ్లు కూడలి వద్ద నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ధర్మ శేఖర్ .బజారు రవికుమార్ .కొత్తబల్లి శోభనాచలం. అబ్బూరి సుబ్బారావు. బొబ్బ గోపాలకృష్ణ. తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు

# దెందులూరుకు చెందిన ఉత్తమ డ్రైవర్ డిపిఆర్‌కు ఘనసన్మానం

**దెందులూరు. డిసెంబర్ 1నవభూమి** వేలాది కిలోమీటర్లు నిత్యం 100లాదిమంది అయ్యప్ప మాలదారులను శబరిమల యాత్రకి తీసుకువెళ్లి క్షేమంగా తీసుకొచ్చిన . తీసుకొస్తున్న ప్రజా సేవకుడు ఉత్తమ డ్రైవర్ గా పేరుపొందిన దెందులూరు గ్రామానికి చెందిన డ్రైవర్ ధరణికోట పోతురాజు(డిపిఆర్) ను పలువురు అయ్యప్ప మాల ధరించి దీక్ష వరమన అనంతరం వచ్చినటువంటి స్వాములు షాలువాతో డిపిఆర్ ను ఘనంగా సత్కరించారు .నగదు బహుకరించారు ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ ప్రతి టూరు టైం టు టైం తీసుకెళ్లి దర్శనాలు సమయానికి పవిత్రమైన సమయంలో తీసుకువెళ్లి ఒక ఊరు కూడా మిస్ అవ్వకుండా చూపించి ఎన్ని ఇబ్బందులు వచ్చినా వెనకడుగు వేయకుండా గమ్యస్థానానికి చేర్చిన మంచి మనసున్న డ్రైవర్ పోతురాజుకు ధన్యవాదాలు తెలిపారు ఇన్ని సంవత్సరాల్లో ఎప్పుడు లేని విధంగా వడ భిక్ష మంచి ఆహారం అందించిన మచిలీపట్నం కాంట్రాక్ట్ నాగేశ్వరావు కి మాల విరమించిన స్వాములు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ మచిలీపట్నం ట్రావెల్స్ వందర్ అవినాష్ కి ఇలాంటి మంచి మనసు ఉన్న డ్రైవర్ పోతురాజు ను ఎన్నుకున్నందుకు బస్సు ఓనర్ అవినాష్ కి కూడా స్వాములు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో సిద్దయ్య స్వామి తాతారావు స్వామి కోటి స్వామి మణికంఠ స్వామి సాయి పాల్గొన్నారు





# ఉడత ఊపులకు భయపడం

- ◆ వావివరసల్లేని వ్యక్తి జేసీ ప్రభాకర్‌రెడ్డి
- ◆ నా తల్లిదండ్రులు,గురువులు సంస్కారం నేర్పారు
- ◆ నేను గెలిచినా, ఓడినా అనంతపురంలో ఉన్నా
- ◆ వైసీపీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ



**అనంతపురం, డిసెంబర్ 1 : నవభూమి** "మీ తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు భయపడం. ప్రాణం అందరికీ ఒక్కటే. ప్రజాస్వామ్య బద్ధంగా పోరాట చేయడానికి వెనుకాడం" అంటూ తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు, అవినీతి ఆరోపణలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. అనంత వెంకటరామిరెడ్డి ఏమన్నారంటే " మా తల్లిదండ్రులు మమ్మల్ని పెంచినప్పుడు గానీ, మాకు చదువు చెప్పిన గురువులు గానీ మాకు సంస్కారం నేర్పారు. ఆ సంస్కారంతో పెరిగే సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నాం. ప్రజాప్రతినిధిగా ఉన్నా లేకపోయినా ఒకేరకంగా ఉన్నా. గెలిచినప్పుడు విర్రవీగలేదు. ఓడిపోయాక కుంగిపోలేదు. ప్రజల సమస్యలే మా సమస్యలుగా అధికారంలో ఉన్నప్పుడు కూడా మాట్లాడాం. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నా, ముఖ్యమంత్రిగా విజయభాస్కర్‌రెడ్డి ఉన్నా.. పార్లమెంట్‌లో మా పార్టీ అధికారంలో ఉన్నా సమస్యలపై మాట్లాడినోళ్లం. నాలుగు సార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా ప్రజలు అవకాశం ఇస్తే నాకు చేతనైనంతలో అభివృద్ధి చేశాం. తెలుగుదేశం పార్టీ నేతలతో సహా బీజేపీ, వామపక్షాలు, మేధావులు, పాత్రికేయులు ఎప్పుడు విమర్శలు చేసినా అందులో సద్విమర్శలను తీసుకుని వాటిని సరిదిద్ది జిల్లాను బాగు చేశాం. ఈ రోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితి గురించి మొన్న ప్రెస్‌మీట్‌లో మాట్లాడా. ఎక్కడ చూసినా అవినీతి జరుగుతోందని, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదని అన్నాను. ఒకరిని ఉద్దేశించి కాకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇసుక, మట్టి, మద్యం, బూడిద వ్యాపారంలో ఉన్నారని చెప్పా. ఈ విషయాలన్నీ పత్రికలు ఘోషించినవే..! ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చినవే. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కూడా వాళ్ల పార్టీ మీటింగ్స్‌లో చెప్పారు. చంద్రబాబు చెప్పినా పరిస్థితి మారలేదనే మేం మాట్లాడాం. వాయిస్ ఆఫ్ ది పీపుల్‌గా మాట్లాడాం. కానీ, సభ్యసమాజం తలదించుకునేలా, వావివరసలు లేకుండా మాకంటే వయసులో పెద్దవాడైన జేసీ ప్రభాకర్‌రెడ్డి మమ్మల్ని వ్యక్తిగతంగా మాట్లాడారు. తాడిపత్రిలో అమాయకులను మాఫియాగా తయారు చేసి మాటల దాడులు చేస్తున్నారు. పది రోజుల క్రితం నేను రైతుల సమస్యలపై మాట్లాడాను. ఆ తర్వాత కాలవ శ్రీనివాసులు కూడా రైతుల సమస్యలపై మాట్లాడారు. గిట్టుబాటు ధర లేదని చెప్పారు. అదే విషయాన్ని చెబితే నాపై అసభ్యంగా మాట్లాడించారు. నేనే కాదు, వాళ్ల పార్టీ వాళ్లు మాట్లాడినా.. ఇతర పార్టీల వాళ్లు మాట్లాడినా ఇదే వ్యవహారం. నేను భూములు కాజేశానని, అవినీతి చేశానని ఆరోపణలు చేస్తున్నారు. మా ఇంట్లో 12 సార్లు మా తండ్రి, నేను ప్రజాప్రతినిధిగా ఉన్నాం. ఇప్పుడు కేంద్రంలో, రాష్ట్రంలో మీరే అధికారంలో ఉన్నారు. మీరు చేసిన ఆరోపణలపై విచారణ చేయండి. నేను సహకరిస్తా. మా తల్లిదండ్రులకు వచ్చిన ఆస్తిని అమ్మి భూములు కొన్నాం. మా నాయన కట్టించిన ఇంట్లోనే ఇప్పటికీ మేం ముగ్గురు అన్నదమ్ములున్నాం. 57 ఏళ్లుగా అదే ఇంట్లో ఉంటున్నాం. ఆ ఇంట్లోనే మీరు పిల్లప్పుడు, నేను పిల్లప్పుడు ఉన్నాం. నీకు నిజాయితీ ఉంటే మీ కుటుంబ ఆస్తులపై కూడా విచారణ కోరండి. నన్ను ఇంటికొచ్చి కొడతాం అని అంటున్నారు. అంత సులభంగా ఉంటుందా? ఐదు మార్లు ప్రజాప్రతినిధిగా ఉన్నా. ఓడిపోయాను.. గెలిచాను. ఓడిపోతే నేను ఏ రోజూ ఊరు విడిచిపెట్టి పోలేదు. గన్‌మన్లలను తీసేసినా మళ్లీ కావాలని కూడా అడగను. నేను ఎక్కడికి వెళ్లినా ఒకడినే వెళ్తా. ప్రతి ఇంట్లోనూ అక్క, చెల్లి, భార్య, తమ్ముళ్లు ఉంటారు. మీలా నేను మాట్లాడను. 1996లో మీరంతా ఊరు విడిచి బెంగళూరుకు వెళ్లిపోతే రఘువీరారెడ్డి, నేను పోరాడాం. వామపక్షాలు కూడా ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆ రోజుల్లో నిలబడ్డాయి. ఆ రోజు తాడిపత్రిలో మీ రాజకీయాన్ని కూడా మేం కాపాడాం. 2004 తర్వాతే మళ్లీ మీరు వచ్చారు. మీలా ఓడిపోయాక పరిగెత్తుకెళ్లి బెంగళూరు, హైదరాబాద్‌కు మేం పోలేదు.

# ప్రతి పౌరుడు హెచ్ఐవి పట్ల అవగాహన కలిగి ఉండాలి

## ఎం పి అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం, డిసెంబర్ 01 నవభూమి** ప్రతి ఒక్క పౌరుడు హెచ్ఐవి పట్ల అవగాహన కలిగి ఉండేలా చూడాలని పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆదివారం జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగము, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా పరిషత్ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ సంయుక్తంగా పచ్చ జెండా ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆర్ట్స్ కాలేజ్ నుండి ప్రారంభమై టవర్ క్లాక్, సుభాష్ రోడ్డు మీదుగా సాగి సప్తగిరి సర్కిల్ కు చేరుకుంది. సప్తగిరి సర్కిల్ లో మానవహారంగా ఏర్పడి హెచ్ఐవి నియంత్రణకు పాటుబడతామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడు హెచ్ఐవి పట్ల అవగాహన కలిగి ఉండేలా చూడాలని, ప్రస్తుతం హెచ్ఐవి జిల్లాలో తగ్గుముఖం పట్టిందని, హెచ్ఐవి పూర్తిగా నిర్మూలించడానికి వైద్య ఆరోగ్యశాఖ తోపాటు మిగతా అన్ని శాఖలు , స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఈబీదేవి మాట్లాడుతూ డిసెంబర్ ఒకటో తేదీ నాడు ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్ దినం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని, హెచ్ఐవి పట్ల ప్రజలందరికీ అవగాహన కలిగించేందుకు హెచ్ఐవి తో ప్రభావితమైన కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు ప్రపంచ ఎయిడ్స్ రోజు ఉపకరిస్తుందని తెలిపారు. ఈ సంవత్సరం'హక్కుల మార్గాన్ని అనుసరించండి-నా ఆరోగ్యం నా హక్కు' అని నినాదంతో ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.ప్రపంచ ఎయిడ్స్ దినం 2024 సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు నాలుగు అవార్డు లభించాయి. అనంతరంఈ ర్యాలీలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి అనుపమ జేమ్స్, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, జిల్లా సూపర్వైజర్ జీవీ రమణ, డిస్ట్రిక్ న్యూక్లియస్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్ రెడ్డి, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఆర్ఆర్సి కోఆర్డినేటర్ గిరిధర్, అనంత నెట్వర్క్ ప్రెసిడెంట్ వీరాంజనేయులు, రామకృష్ణారెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సుజాత, డెమో త్యాగరాజ్, డిప్యూటి హెచ్ఈఓ గంగాధర్, రైడ్స్ క్రిష్టప్ప, హెచ్ఓ సత్యనారాయణ, పీఎంఓ నాగన్న, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, రైడ్స్ సిబ్బంది, లింక్ వర్కర్స్, ఎన్ వై కే, ఆర్ఆర్సి, ఇండియన్ రెడ్ క్రాస్, స్థానిక ఆర్ట్స్ కాలేజ్, ఎస్ఎస్బిఎన్ కాలేజ్ విద్యార్థులు, వివిధ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సమావేశ భవనంలో ఉత్తమ సేవలు అంది హెచ్ఐవి కేంద్రాలకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేయడం జరిగింది.



## ఘనంగా గ్రామ దేవత యలమర్తి వారి ఆడపడుచు పాటిమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**దెందులూరు.డిసెంబరు 1 నవభూమి** తుఫాన్ వలన రైతులను తీవ్ర భయాందోళన గురి చేస్తున్న నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ప్రజలను రైతులను చల్లగా చూడాలని మండలంలోని ప్రసిద్ధిగాంచిన పేరుపొందిన పెరుగు గూడెం - చల్ల చింతలపూడి - తిమ్మన్నగూడెం గ్రామాల మధ్య వెలసిన యలమర్తి వారి ఆడపడుచు గ్రామ దేవత శ్రీ పాటిమ్మ తల్లి అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పాటిమ్మ తల్లి దేవస్థానం కమిటీ చైర్మన్ దంపతులు పెరుగు గూడెం గ్రామ మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాస్ హేమలత దంపతులు పాటిమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి ప్రజలు. రైతులు అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నారు ఆదివారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున శ్రీ పాటిమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## దెందులూరు బిఆర్ నర్సింగ్ కాలేజీలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం



**దెందులూరు. డిసెంబర్ 1 నవభూమి** ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా విచ్చలవిడి శృంగారం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే హెచ్ఐవి ఎయిడ్స్ బారినపడే అవకాశం ఉందని దెందులూరు బిఆర్ నర్సింగ్ కాలేజీ కరస్పాండెంట్ సుగ్గి శెట్టి నూకరాజు అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ఎయిడ్స్ దినోత్సవం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ వ్యాధి సోకిన వారితో లైంగిక సంబంధం పెట్టుకోవడం వల్ల ఇతరుకు వ్యాపిస్తుందని ఇప్పటివరకూ ఎయిడ్స్ వచ్చినవారిలో నూటికి 85 మంది లైంగిక సంబంధంతో సమస్యని తెచ్చుకున్నవారే.ఒకే సిరంజీ, సూదిని ఎక్కువ మంది వాడడం వల్ల కూడా వస్తుందని రక్తమార్పిడి ద్వారా కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని అదే విధంగా తల్లికి ఎయిడ్స్ వ్యాధి ఉంటే.. అది శిశువుకి కూడా వస్తుందని.సురక్షితం కానీ శృంగారం వల్ల కూడా ఈ వ్యాధి వస్తుందని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు అనంతరం ఎయిడ్స్ గుర్తు నమోనాను విద్యార్థులు ప్రదర్శించారు



# ముంపు పేరుతో అభివృద్ధికి నోచుకోని మండలం


- మండల కేంద్రంలో బహిరంగ మరుగుదొడ్లు ఏర్పాటు చెయ్యాలి
- ఆర్‌టిసి బస్సులు అన్ని సర్వీసులు కుక్కునూరు లోపల ఉన్న బస్టాండ్‌కి వెళ్ళాలి
- అధికారులు నిర్లక్ష్యం విడి సమస్యలు పరిష్కరించాలి



**కుక్కునూరు విలేఖరి (నవభూమి)డిసెంబర్ 1 :-** కుక్కునూరు కేంద్రంలో బహిరంగ మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు సీపీఎం పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశం పులదాసు రమేష్ అధ్యక్షతన సుందరయ్య భవనం ప్రజా సంఘాలు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ మండల కేంద్రానికి నిరంతరం ప్రజలు అధికారులను, కలవడానికి, అదేవిధంగా వారి యొక్క వ్యక్తిగత పనులు,వ్యాపారాలు,బ్యాంకులు పనులు రీత్యా కుక్కునూరు మండల కేంద్రానికి తరుచూ వస్తున్నారు. ఒక చిన్న అప్లికేషను కావాలి అన్న కుక్కునూరు రావాల్సిందే, ఈ తరుణంలో గంటలు తరబడి సమయం కేటాయించి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరుగుదొడ్లు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, మండల కేంద్రంలో మరుగుదొడ్లు ఏర్పాటు చెయ్యాలని గత ఐదు సంత్సరాలు నుండి పలుమార్లు అధికారులకు సీపీఎం పార్టీగా విన్నవించుకున్న ఇప్పటి వరకు స్పందించిన నాధుడే లేడు, ఇప్పటికే ముంపు పేరుతో మండలాన్ని అభివృద్ధికి నోచుకోకుండా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో మరుగుదొడ్లు నిర్మించాలని,కుక్కునూరు లోపల ఉన్న బస్టాండ్ కి ప్రతి ఒక్క బస్ సర్వీసులు వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గతంలో అన్ని సర్వీసులు బస్టాండ్ కి వెళ్ళేవి కానీ ఇప్పుడు వెల్లకపోవడంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బయ్యన శ్రీను, మండల కమిటి సభ్యులు యర్నం సాయికిరణ్, నాయకులు విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

# శక్తి స్వరూపిణి శ్రీ ముత్యాలమ్మవారు

- కొలిచిన వారికి కొంగు బంగారంగా వరాలిస్తున్న అమ్మవారు
- ఎందరికో ఉద్యోగాలు... ఆరోగ్యాలు బాగు చేసిన అమ్మవారు
- లక్షలాది సంఖ్యలో అమ్మవారిని కొలుస్తున్న భక్తులు




**కౌతాళం, డిసెంబర్ 01,(నవభూమి న్యూస్ ):** శ్రీ ముత్యాలమ్మా%ొ%.. పాహిమాం%ొ%. రక్షమామ్%ొ%. నిను కొలుచు భాగ్యం భక్తుల పూర్వ జన్మ సుకృతం. నమ్మి కొలిచే భక్తులకు కొంగు బంగారంగా వరాలిచ్చే అమ్మవారిగానూ... భక్తుల గుండె చప్పుడుగానూ, ఆరాధ్య దైవంగా శ్రీ ముత్యాలమ్మ వారు కొలవబడుతున్నారు. ప్రజల ఆరోగ్య, ఉద్యోగప్రదాయినిగా ముత్యాలమ్మవ్వ వారు విరాజిల్లుతున్నారు. వివిధ జబ్బులతో బాధపడుతున్న ప్రజలెందరివో ఆరోగ్యాలను నయం చేశారని భక్తులు పేర్కొంటున్నారు. అలాగే అమ్మవారి చల్లని ఆశీసులతో ఉద్యోగ రంగాల్లో ఎందరో స్థిరపడ్డారు. ఎందరో భక్తుల ఆరోగ్యాన్ని బాగు చేసిన అమ్మవారు ప్రజల ఆరాధ్య దైవంగా పిలవబడుతున్నారు. నమ్మిన వారికి అమ్మవారు అండగా నిలుస్తున్నారు. భక్తుల ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్నారు. గుంతకల్ మండలం జి. కొట్టాల గ్రామంలోని ముత్యాలమ్మపేటలో కొలువుదీరిన శ్రీ ముత్యాల పల్లె ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం సుందరంగా అమ్మవారిని భక్తులు ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ముత్యాల గంగరాజు స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి మంగళ హారతి, నైవేద్యం తదితర పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని, పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకు న్నారు. వచ్చిన భక్తులకు కోరికలు నెరవేరిన భక్తులు ప్రసాదాన్ని ఏర్పాటు చేశా రు. కొలిచే వారికి కొంగు బంగారంగా వరాలి చ్చే అమ్మవారిగా ముత్యాలమ్మవ్వ వారు పేరు గాంచారు. భక్తుల ఆరాధ్య దైవంగానూ ఇంటికి ఇలవేల్పుగానూ అమ్మవారు పిలువబడుతున్నారు. భక్తులు మనస్సులో కోరిక కోరుకుని అమ్మవారి ఆలయం వద్దకు వచ్చి పూజల్లో పాల్గొని వెళ్లినా తమ కోరికలు నెరవేరుతున్నాయని భక్తులు చెబుతున్నారు. ఎందరో రాజకీయ ప్రముఖులు, హృద్రోగ సమస్యలు ఉన్న వారు అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజ పాల్గొంటున్నారు. వారి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు ఆది, మంగళ, శుక్ర వారాల్లో ముత్యాలమ్మవ్వ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తారు.

# ఆలయాల్లో అమావాస్య పూజలు

- జగద్గురుఖాదర్ లింగస్వామి దర్గాలో అమావాస్య పూజలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

**కౌతీళం, డిసెంబర్01(నవభూమి న్యూస్):** కౌతాళం లోని శ్రీ శ్రీ జగద్గురు ఖాదర్ లింగస్వామి దర్గాలో ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు వివిధ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చారు. కర్ణాటక, తమిళనాడు ,మహారాష్ట్ర ల నుండి భక్తులు దర్గాకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రమైనటువంటి ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామి మూలవిరాట్ ను లక్ష పుష్పార్చనతో పూజలు నిర్వహించిన ఆలయ సహా కమిషనర్ విజయరాజు స్వామి వారిని దర్శించి ముడుపులు చెల్లించిన భక్తులు. రెండు ప్రధాన ఆలయాల్లో భక్తులతో కిక్కిరిసాయి.



## మనోహర్‌ను కాపాడాలని ఎమ్మెల్యేకు విన్నవించిన కుటుంబ సభ్యులు

### వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు



**అనంత పురం డిసెంబర్ 01 నవ భూమి** ఓ పేదవాడి ప్రాణాలు కాపాడాలని కుటుంబ సభ్యులు మడకశిర ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు ను తల్లిదండ్రులు కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు బ్రెయిన్ స్ట్రోక్ గురైన మనోహర్ ను తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు డాక్టర్లను కోరారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామానికి మనోహర్ కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అనంతపురంలోనీ కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి వెళ్ళాలని వైద్యులు సూచించారు. కానీ అక్కడ వెంటిలేటర్ లేదని చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు ని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే స్విమ్స్ ఆసుపత్రి యాజమాన్యానికి ఫోన్ కాల్ చేసి మనోహర్ ను చేర్పించుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రస్తుతం మనోహర్ కు స్విమ్స్ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఎం ఎస్ రాజుకి ధన్యవాదాలు తెలియజేశారు.

## మెగా పేరెంట్,టీచర్ మీటింగ్లో తల్లిదండ్రులందరూ తప్పక పాల్గొనాలి

### జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ బాలాజీ రావు



**నెల్లూరు,డిసెంబర్ 1,(నవభూమి)::**నెల్లూరు జిల్లాలో 2061పాఠశాలల్లో మెగా పేరెంట్,టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని పండగ వాతా వరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ బాలాజీ రావు ఒక ప్రకటనలో చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 7వ తేదీన అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందని,ఆ మేరకు పాఠశాలల్లో ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు,పాఠశాలల మధ్య ఒక బలమైన అనుబంధాన్ని ఏర్పరచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా డీఈవో చెప్పారు. తల్లిదండ్రులందరూ ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొని తమ చిన్నారుల బోధనా సామర్థ్యాలు, పాఠశాలలో వారి నడవడిక, విద్యార్థుల ఉన్నతికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకొని విద్యార్థులను ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించేందుకు ఉపాధ్యాయులకు సహకరించాలని డిఇఓ పిలుపునిచ్చారు. అలాగే పాఠశాలల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలను కూడా తల్లిదండ్రులతో చర్చించనున్నట్లు చెప్పారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన సౌకర్యాలు, పాఠశాల కార్యకలాపాలను తల్లిదండ్రులకు ఈ కార్యక్రమంలో పూర్తిగా వివరిస్తామని, వారి సూచనలు, సలహాలను కూడా తీసుకొని అమలు చేసేందుకు కృషి చేస్తామని డీఈవో చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా, మండలస్థాయి అధికారులు, ఉపాధ్యాయులు అందరూ విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేయాలని, స్థానిక ప్రజా ప్రతినిధులు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని ఈ సందర్భంగా డీఈఓ పిలుపునిచ్చారు.

### ఎమ్మెల్యే "ఏలూరి"కి చేరిన

# విజినరీ లీడర్ అవార్డు

- లండన్ నుంచి ఎన్ఆర్ఐ ప్రతినిధి ద్వారా ఏలూరికి అందజేత
- లండన్ బ్రిటిష్ పార్లమెంట్ వేదికగా అవార్డు అందుకున్న నేతలు
- ప్రజానేతకు అరుదైన అంతర్జాతీయ పురస్కారం





**పర్చూరు, డిసెంబర్ 1 (నవభూమి)** బ్రిటిష్ పార్లమెంట్ లండన్ వేదికగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ హానర్ ఇంగ్లాండ్ ప్రకటించిన విజనరీ లీడర్ అవార్డు ఎమ్మెల్యే ఏలూరికి చేరుకుంది. లండన్ నుంచి ఈ అవార్డును లండన్ వచ్చిన తెలుగుదేశం పార్టీ ఎన్నారై ప్రతినిధి చింతలపూడి రామ్ ఎమ్మెల్యే ఏలూరికి అందజేశారు. గత నెల 15న లండన్ పార్లమెంట్ వేదికగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కి విజనరీ లీడర్ అవార్డు ప్రకటించిన విషయం విధితమే. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి లండన్ పర్యటన వాయిదా వేసుకున్నారు. ఈ నేపథ్యంలో యూకే వ్యవహారాల తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు ఎమ్మెల్యే ఏలూరి తరఫున అవార్డు అందుకున్నారు. దీంతో ఆదివారం లండన్ నుంచి ఇండియాకు వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రతినిధి చింతలపూడి రామ్ అవార్డును ఎమ్మెల్యే ఏలూరికి అందజేశారు. ప్రతినిత్యం ప్రజా శ్రేయస్సు కాంక్షించే ఎమ్మెల్యే ఏలూరికి అరుదైన గౌరవం దక్కింది. లండన్ వేదికగా ప్రజల అర్షద్వానాల మధ్య ప్రజా నేత సాంబన్నకు లండన్ పార్లమెంట్ అతిరథ మహారథులసమక్షంలో అంతర్జాతీయ అందుకోవడం గర్వకారణమని రామ్ తెలిపారు. నిరంతరం ప్రజల కోసం ప్రజల వెంట ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న సాంబన్నకు వచ్చిన ఈ పురస్కారాన్ని అందుకోవడం తమ అదృష్టం అన్నారు. దేశ వ్యాప్తంగా ముగ్గురికి ఈ అవార్డు లభించింది. వీరిలో ఎమ్మెల్యే ఏలూరి ఉన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి అవార్డు ప్రధానోత్సవానికి యూకే పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఎమ్మెల్యే ఏలూరి తరఫున అవార్డు ప్రధానోత్సవంలో యూకే ఎన్నారై వ్యవహారాల నేతలు అవార్డును అందుకున్నారు. యూకే ఎన్నారై ప్రతినిధి అవార్డును ఎమ్మెల్యే ఏలూరికి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అరుదైన అవార్డు లండన్ లో తెలుగు జాతిఖ్యాతిని పెంచిందన్నారు. ఎమ్మెల్యే ఏలూరికి అరుదైన అంతర్జాతీయ పురస్కారం రావడం పట్ల అసెంబ్లీ వేదికగా సహచర ఎమ్మెల్యేలు ,మంత్రులు, ముఖ్యమంత్రి ,సభాపతి ప్రశంసించడం అరుదైన గౌరవంగా భావిస్తున్నారు.

### గిరిజన విద్యార్థులందరూ బిర్సా ముండా జీవితాన్ని

## ఆదర్శంగా తీసుకోవాలి:లక్ష్యాలను సాధించాలి

- గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీలకు విశేష స్పందన
- విద్యార్థులకు బహుమతులు అందజేసిన మేయర్
- నెల్లూరు నగర మేయర్ స్రవంతిజయవర్ధన్











**నెల్లూరు,డిసెంబర్ 1,(నవభూమి)::**గిరిజన యోధుడు బిర్సా ముండా పోరాట పఠిమను ఆదర్శంగా తీసుకుని.. విద్యార్థులంతా జీవితాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ ఆకాంక్షించారు. గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి ప్రాంతం దగ్గర ఉన్న గుర్రం బాబయ్య కళ్యాణ మండపంలో వ్యాస రచన పోటీల విజేతలకు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి,బిర్సా ముండా,వెన్నెలకంటి రాఘవయ్యల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. విద్యార్థులకు బహుమతుల ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్ స్రవంతి జయవర్ధన్,మాజీ పీవోఐటిడిఏ,స్టేట్ ఆడిట్ జాయింట్ డైరెక్టర్ యాకసిరి వెంకటేశ్వర్లు, ఉలవపాడు జెడ్పీటీసీ అరుణ,ఎన్ టిఎఫ్ జిల్లా అధ్యక్షులు పులి చెంచయ్యలు పాల్గొని.. వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ డిక్షనరీ,గిరిపుత్ర ఫౌండేషన్ సర్టిఫికెట్ ను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ తుపాన్ ను సైతం లెక్క చేయకుండా తరలి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్తలలో పోటీ తత్వాన్ని పెంపొందించి ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన గిరి పుత్రా ఫౌండేషన్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పోటీలో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి.. శాలువాతో సన్మానించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థిని,విద్యార్థులకు డిక్షనరీ,అభినందన పత్రంలను అతిథులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని,విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా పంపిణీ



**అనంతపురం, డిసెంబర్ 01 నవభూమి** సింగనమల నియోజకవర్గం పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన చెరుకూరి తిరుపతి నాయుడు విద్యుత్ ఘాతకానికి గురై మరణించగా, చెరుకూరి తిరుపతి నాయుడు భార్య చెరుకూరి శాంతమ్మకు ఆదివారం అనంతపురం నగరంలోని పార్లమెంట్ సభ్యులు క్యాంపు కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదగా రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వర కుమార్, ఎస్ఈ సంపత్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఏఈ చంద్రశేఖర్, కోమటికుంట్ల గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. విద్యుదాఘాతానికి గురై చెరుకూరి తిరుపతి నాయుడు మరణించగా, అతని కుటుంబానికి 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా రావడానికి ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరగా అప్రూవల్ చేపించినందుకు సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, కోమటికుంట్ల గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సాటి మనిషికి సాయపడితే ప్రతి ఒక్కరూ దేవుడులా కొలుస్తారు

**దెందులూరు.డిసెంబరు 1 నవభూమి** సాటి మనిషికి సాయపడితే ప్రతి ఒక్కరూ దేవుడులా కొలుస్తారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ . ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.. ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం నాయకులు నేరుసు సుబ్బయ్య యాదవ్ తండ్రి కీర్తిశేషులు నేరుసు రామారావు యాదవ్ తొమ్మిదవ వర్ధంతి ఏలూరు పత్తే బాధ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు. రామారావు యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. రామారావు యాదవ్ చేసిన సేవలు గురించి కొనియాడారు..ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ ఆర్టిసి విజయవాడ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నక్క సూర్య చంద్రరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బద్దానీ శ్రీనివాస్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు....





## దళిత నివాసిత ప్రాంతాల్లో గ్రామాల్లో మౌళిక సదుపాయాలు త్వరగా ఏర్పాటు చేయాలి





**దెందులూరు.డిసెంబరు 1 నవభూమి** రాష్ట్రంలో మైనారిటీ గ్రామాలలో మౌలిక సదుపాయాలు త్వరగా ఏర్పాటు చేయాలి దళిత సేన డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా చింతలపూడి పట్టణం బట్టు వారి గూడెంలో చింతలపూడి మండలం మహిళా అధ్యక్షురాలు చింతలపూడి పట్టణ అధ్యక్షులు కార్తిక్ అధ్యక్షతన దళిత సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సికాకొల్లు స్టాలిన్ నాయకత్వాన్న జరిగిన దళిత సేన కార్యకర్తల సమావేశంలో దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో మౌలిక వసతులు రోడ్ల నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం మరియు మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలని రవి ప్రకాష్ డిమాండ్ చేశారు అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గ్రామాలలో మౌలిక వసతులు ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని బడుగు బలహీన వర్గాల జీవన పరిస్థితులను మెరుగుపరచాలని రవి ప్రకాష్ విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో దళిత సేన లింగపాలెం మండల బీసీ సెల్ అధ్యక్షులు కొప్పుల నాగేందర్ మరియు బట్టువారిగూడెం గ్రామ దళిత సేన అధ్యక్షులు తాడిగడప భాను ప్రసాద్ ఉపాధ్యక్షులు నారపాము రాజేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాలతో మండలాలలో గ్రీవెన్స్ డే

### ధర్మవరం నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం



**అనంతపురం డిసెంబర్ 01 నవభూమి** ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు, ఈనెల మూడో తేదీ నుండి 31వ తేదీ వరకు సచివాలయ సిబ్బందితో కలిసి ధర్మవరం నియోజకవర్గం లో "గ్రీవెన్స్ డే"ని నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా, 3వ తేదీ మంగళవారం కార్యక్రమం తాడిమర్రిలో ప్రారంభమవుతుంది.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు తమ సమస్యలను, అవగాహన దారితీసే అంశాలను సులభంగా రిజిస్టర్ చేసుకోగలుగుతారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించడానికి మంత్రి , సంబంధిత అధికారులు నిబద్ధతతో పని చేస్తారు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వారి సమస్యలకు సమగ్ర పరిష్కారాలు అందించడమే ముఖ్య ఉద్దేశ్యంగా ఉంటుంది అని అన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను తెలియజేయాలని మంత్రి సిబ్బంది కోరారు

## ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

### జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ



**అనంతపురం డిసెంబర్ 01 నవభూమి** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా "టేక్ రైట్ పాత్" అనే నేపథ్యంతో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో, స్థానిక ఆర్ట్స్ కళాశాల నుండి సప్తగిరి సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు.ఈ కార్య క్రమం లో భాగంగా మొదటగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు, అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అనేది అంటూ వ్యాధి కాదని, ఈ వ్యాధిగ్రస్తులను దూరంగా పెట్టకుండా, మానవత దృక్పథంతో వాళ్ళని సమాజంలో భాగంగా సమానంగా చూడాలని, ఎయిడ్స్ వ్యాధిని అరికట్టడంలో జిల్లా ముందడుగులో ఉన్నదని, దీనికి తమవంతు కృషి చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. 2030 నాటికి ఈ ఎయిడ్స్ అనే మహమ్మారిని అంతమొందించే లక్ష్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ముందుకు వెళుతుందని దీనికోసం ప్రజలందరూ తమవంతుగా అవగాహన పెంచుకుంటూ, పెంపొందిస్తూ దోహదపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు, నగరపాలక డిప్యూటీ మేయర్లు , జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది మరియు ఎన్.జి.ఓ లు పాల్గొన్నారు

## మాడుగులలో ఎయిడ్స్ డే వేడుకలు

**మాడుగుల డిసెంబర్ 1 నవభూమి** ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా గ్రామం లో మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రి ఐసీటీసీ , బీసీ కళాశాల బాలికల వసతి గృహం ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణ కు ర్యాలీ నిర్వహించారు.అనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్ కు వ్యతిరేకంగా విద్యార్థినిలు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎల్.శ్రీనివాస్ , డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ సమాజం లో హెచ్ ఐ వి తీవ్రతను , వాటి లక్షణాల గురించి తెలియజేసారు.అలాగే వ్యాధి నివారణ మార్గాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ శ్రీనివాస్ , ఆషా వర్కర్లు విద్యార్థినిలు అధికంగా పాల్గొన్నారు.





## తుఫాను దాడికి గడ్డివామి కూలి ఆవు దూడ మృతి

### బోరున విలపిస్తున్నారు రైతు కుటుంబం





**పెద్దపంజాణి నవభూమి డిసెంబర్ 1** పెద్దపంజాణి మండలం కేంద్ర పరిధిలోని శివాడి గ్రామంలో ఫెంగల్ తుఫాను కారణంగా గత రెండు రోజుల కురుస్తున్న వర్షం కారణంగా గడ్డి వాము నెలకులడం తో దాని కింద ఉన్న ఒక ఆవు లేగదూడ రెండు మృతి చెందడం జరిగింది గ్రామస్తుల కథనం మేరకు పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చెందిన దళిత రైతు టి రవి, వ్యవసాయం చేసుకొని జీవనం సాగించేవాడు జీవనాధారంగా ఒక పాడి ఆవుని సైతం పెంచుకొని దాని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకొని వచ్చేవాడు గత రెండు రోజులుగా కురుస్తున్న తుఫాను కారణంగా శనివారం రాత్రి వర్షం కురుస్తుండడంతో పాడి ఆవుని దూడను గడ్డి వాము కింద కటేసి ఉంచాడు అదే రోజు రాత్రి యెడతెరపు లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా బాగా తడిసిన గడ్డి వాము ఒకసారిగా కూలిపోవడంతో క్రిందనే ఉన్న పాడి ఆవుతో పాటు లేగా దూడ సైతం అక్కడికక్కడే మృతి చెందాయి పడి ఆవు మృతి తో రైతు టి. రవి కి దాదాపు ఒక లక్ష రూపాయలు దాకా నష్టం జరిగిందని బోరున ఏడుస్తూ విలపించాడు ప్రభుత్వం తననీ ఆదుకోవాలని వేడుకోవడం జరిగింది

## క్షణికావేశానికి లోనవద్దు..ప్రతి కార్యకర్తకు నేను అండగా ఉంటా

### మంత్రి గొట్టిపాటి రవికుమార్






**బల్లికురవ, డిసెంబర్ 1 (నవభూమి)** బల్లికురవ మండలం, గొర్రెపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, సోషల్ మీడియా యాక్టివిస్ట్, నారా లోకేష్ వీరాబిమాని, తనకు వ్యక్తిగతంగా ఎంతో సన్నిహితుడైన శ్రీను ఆత్మహత్యకు పాల్పడడం పట్ల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బల్లికురవ మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతంలో, సోషల్ మీడియాలో చురుకైన పాత్ర పోషించిన శ్రీను ఆత్మహత్య చేసుకున్న విషయం తెలియగానే మంత్రి కుమారుడు గొట్టిపాటి హర్షవర్ధన్ వెంటనే హాస్పిటల్ కు వెళ్లి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, శ్రీనును బతికించేందుకు హుటాహుటిన మణిపాల్ ఆసుపత్రికి తరలించారు.ఎంత ఖర్చు అయినా చివరి క్షణం వరకు శ్రీనును దక్కించుకునేందుకు ఎంతో ప్రయత్నించారు. కానీ విధివశాత్తు శ్రీను టీడీపీ శ్రేణులను, అతడి కుటుంబసభ్యులను కన్నీటిలో ముంచెత్తుతూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు..ఎంతో భవిష్యత్తు ఉన్న కార్యకర్త శ్రీను ఇలా బలవన్మరణానికి పాల్పడడం పట్ల మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కష్టం వచ్చినా పార్టీపరంగా, వ్యక్తిగతంగా తాను అండగా ఉంటానని, దయచేసి కార్యకర్తలెవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని అభ్యర్థిస్తున్నారు.. శ్రీను ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ..ఈ విషాద సమయంలో శ్రీను కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

## అందరికీ అందుబాటులో "ఎల్ఈడి సైనేజ్"

### ఎల్ఈడి సైనేజ్‌ను జిల్లా ప్రజలందరూ ఆదరించాలి

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

### ఎల్ఈడి సైనేజ్ ను ప్రారంభించిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి








**నెల్లూరు,డిసెంబర్ 1,(నవభూమి)::**నెల్లూరు నగరంలోని మాగుంట లేఔట్ లో హబ్ దగ్గర నూతన ఎల్ఈడి సైనేజ్ ప్రారంభానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పలువురు పాల్గొని.. ఎల్ఈడి సైనేజ్ అధినేత షేక్ రియాజ్, బంధుమిత్రులతో కలిసి ఎల్ఈడి సైనేజ్ ను అట్టహాసంగా ప్రారంభించారు.ఎల్ఈడి సైనేజ్ షోరూం ప్రారంభానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి ఎల్ఈడి సైనేజ్ అధినేత షేక్ రియాజ్ శాలువాతో ఘనంగా సత్కరించి.. పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ఈడి సైనేజ్ లో అత్యాధునిక మిషన్ తో కస్టమర్ కి కావాల్సిన ఎల్ఈడి లైటింగ్ పేరు బోర్డు తయారు చేయడం ఎల్ఈడి సైనేజ్ ప్రత్యేకత అన్నారు.పెద్ద పెద్ద నగరాలకు దీటుగా ఎల్ఈడి సైనేజ్ ఏర్పాటు చేసిన అధినేత రియాజ్ కు అభినందనలు తెలియజేశారు.ఎల్ఈడి సైనేజ్ అధినేత షేక్ రియాజ్ మాట్లాడుతూ ఎల్ఈడి సైనేజ్ ప్రారంభానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ ఎల్ఈడి సైనేజ్ లో సరసమైన ధరకే లైటింగ్ పేర్ల బోర్డు అందిస్తున్నామని.. జిల్లా ప్రజలందరూ సందర్శించి ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాజునోసియన్,టింకు తన్వీర్,అష్వాక్, తదితరులు పాల్గొన్నారు

## వెదుళ్ళపల్లిలో యజ్ఞ హాస్పటల్

# వైద్య శిబిరానికి విశేష స్పందన

**బాపట్ల – నవభూమి :** బాపట్లలోని యజ్ఞం హాస్పిటల్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా వెదుళ్ళ పల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని యజ్ఞ హాస్పిటల్ యండి ప్రముఖ కార్డియాలజిస్ట్ యజ్ఞ శ్రీకాంత్ ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో కార్డియాలజీ నిపుణులు,రేడియాలజీ , స్త్రీల వైద్య నిపుణులు, ఎముకలు కీళ్ల శాస్త్ర చికిత్స నిపుణులు మరియు షుగర్ వ్యాధి నిపుణులు పాల్గొని రోగులకు తగిన పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరానికి 300 పైగా రోగులు రావడంతో ఈ శిబిరానికి పేద మధ్యతరగతి ప్రజల నుండి విశేష స్పందన వచ్చిందని హాస్పిటల్ అధినేత ప్రముఖ కార్యాలజీ డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ తెలియజేశారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ గుండెకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు.ఈ సందర్భంగా యజ్ఞ శ్రీకాంత్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని మారుమూల గ్రామాలలో సైతం తమ యజ్ఞ హాస్పటల్ ఆధ్వర్యంలో గడిచిన సంవత్సర కాలం నుండి ఇప్పటివరకు 14 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని,సేవే లక్ష్యం సేవే మార్గం అనే నినాదంతో భవిష్యత్తులో ప్రతి గ్రామానికి వైద్య సేవలు అందించడమే ధ్యేయమని ఈ అవకాశాన్ని బాపట్ల జిల్లాలోని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.



## దేవరగట్టులో అమావాస్య ప్రత్యేక పూజలు

**హొళగుంద. డిసెంబర్ 01 (నవభూమి)** దేవరగట్టు శ్రీ మాళ మల్లేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు మల్లయ్య స్వామి, మహేష్ స్వామి తెలిపారు. తెల్లవారు జాము నుండే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అయిన జలాభి షేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చన, బండారు చందన అభిషేకం తో పాటు ఆకుపూజ నిర్వహించి పూలమాల లతో స్వామి, అమ్మవార్లను అలంకరించారు, భక్తులు సాష్టాంగ నమస్కారం చేస్తూ మహిళలు ప్రతి మెట్టుకు ఒక్కో టెంకాయ కొడుతూ, పూలు పెడుతూ, కర్పూరం, బండారు, కుంకుమ అంటిస్తూ గిరిపైకి ఎక్కరు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకు ని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



## మాగుంట వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న కొండ్రెడ్డి రంగారెడ్డి





**నెల్లూరు,డిసెంబర్ 1,(నవభూమి):**:ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి వేడుకలకు నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి హాజరై.. దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.మాజీ ఎంపీ మాగుంటకు నివాళులర్పించిన వారిలో ఏపీ స్టేట్ ఎంయంఎస్ఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసు నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఘంటసాల 102వ జయంతి

**నెల్లూరు,డిసెంబర్ 1,(నవభూమి):**:పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతి వేడుకలు నగరంలోని పురమందిరంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రిటైర్డ్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ ఐఆర్ఎస్ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గాయని,గాయకులు ఘంటసాల మధుర గీతాలను ఆలపించారు.అనంతరం ప్రముఖ తబలిస్ట్ శాంతి కుమార్ కు అతిథులచే సన్మానం జరిగింది. ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం నోవా బ్లడ్ బ్యాంక్ సెంటర్లో తెలంగాణ రిటైర్డ్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ ఐ ఆర్ ఎస్ మూర్తితో కలిసి నిర్వాహకులు నీలకంఠం 103 సారి రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో పిన్ను గంగాధర్,నెల్లూరు జిల్లా మాజీ పోలీస్ ప్రెసిడెంట్ శ్రీహరి,సీనియర్ గాయకులు ఆకుతోట రమణయ్య,ద్విగల గాయకులు రామచంద్రరావు, పెంచల రెడ్డి,ప్రసాద్ బాబు,సుజాత,లక్ష్మి, కళాకారుల బృందాలు పాల్గొన్నాయి.





## అటవీ శాఖ ఉద్యోగుస్తుల

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర
- ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**నెల్లూరు,డిసెంబర్ 1,(నవభూమి):**:అటవీ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుస్తులకు ఏ సమస్య వచ్చిన తను అండగా ఉండి.. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె రవీంద్ర పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని ఓ కళ్యాణ మండపంలో సర్వసభ్య సమావేశం,నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె శశి భూషణ్ యాదవ్,కోశాధికారి కె సురేష్ లు పాల్గొని.. నూతన కార్యవర్గ సభ్యులను ఓటింగ్ పద్ధతిలో ఎనుకున్నారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యవర్గంలో ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులుగా కె రవీంద్ర, ఉపాధ్యక్షులుగా రవి శేఖర్, కార్యదర్శిగా శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుమన్, కోశాధికారిగా సలీం,జాయింట్ సెక్రటరీగా ప్రసన్న కుమార్ లను సభ్యులుగా ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకోవడం జరిగిందన్నారు.అటవీ శాఖ ఉద్యోగుస్తుల పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం





జరిగింది అన్నారు.అటవీ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ పని చేస్తుందన్నారు.నెల్లూరు జిల్లాలో నూతనంగా ఎన్నికైన సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మాట్లాడుతూ ఈ నూతన కార్యవర్గ ఎన్నికల్లో తనను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.అటవీ శాఖ ఉద్యోగుస్తుల అందరితో కలిసి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి

# స్థిరస్థాయిగా నిలిచిపోయారు

**నెల్లూరు,డిసెంబర్ 1,(నవభూమి):**: ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యులు దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా నెల్లూరు నగరంలోని ఎస్ 2 సినిమా హాల్లో దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి 29వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జెడ్పీ చైర్మన్ చెంచల బాబు యాదవ్ పాల్గొని.. దివంగత నేత సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాగుంట కుటుంబం యొక్క సేవలు ఎనలేనివని కొనియాడారు.మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి హయాంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని గుర్తు చేశారు.దివంగత నేత మా గుంట కుటుంబం గురించి చెప్పాలంటే ఒకే కుటుంబం నుంచి ముగ్గురు పార్లమెంటుకు ఎన్నిక కావడం చరిత్రలో అరుదుగా కనిపిస్తుందని,అయితే మాగుంట కుటుంబం నుంచి ముగ్గురు ఎన్నిక అయ్యి చరిత్ర తిరగరాసారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సీవి శేషారెడ్డి,పత్తి రవీంద్రబాబు,కొండ్రెడ్డి రంగారెడ్డి,ఉడతా నరసింహారావు,విజయ భాస్కర్ రెడ్డి,కమలాకర్ రెడ్డి,ఎస్2 సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

మాజీజెడ్పీచైర్మన్ చంచలబాబుయాదవ్

